క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బొబ్బిలి రూరల్: విద్యార్థులు అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ సీఐ హేమసుందర్ అన్నారు. మండలంలోని కోమటిపల్లి భాస్కర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ప్రమాదాలు జరిగేటప్పుడు ఏం చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. రాజేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి వెండి కిరీటం



వెండి కిరీటాన్ని అందజేస్తున్న సురేష్, రమణి దంపతులు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలోని స్వామివారికి రాజాం పట్టణానికి చెందిన హనుమాన్‌శెట్టి సురేష్, రమణి దంపతులు బుధవారం వెండి కిరీటం సమర్పించారు. 500 గ్రాముల బరువున్న కిరీటంను ఆలయ నిర్వాహకులకు అందజేసి తమ మొక్కును తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రేజేటి సత్తిబాబు శర్మ, రేజేటి వంశీ శర్మ పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న సిబ్బంది

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆడిట్ జరిగింది. జిల్లా పరిషత్‌కు చెందిన ఆడిటర్లు ఎంవీబీఎస్ రాజు, రామేశ్వరరావు సంయుక్తంగా ఆడిట్ నిర్వహించారు. వార్షిక ఆడిట్ జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లోపింటి త్రినాథ్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ధర్మారావు

రేగిడి: మండలంలోని దేవుదల రైతు సేవా కేంద్రం వద్ద సంకిలి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ దూబ ధర్మారావు బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని సంకిలి పీఏసీఎస్ ఇన్‌చార్జ్ అరుణశ్రీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.చిన్నారావు, ఏఓ జి.మురళీకృష్ణ, కర్నేన మహేశ్వరరావు పాల్గొన్నారు.

వేతనదారులకు వంద రోజుల పని



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: ఉపాధి హామీ జాబ్‌కార్డుదారులందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంపై వారాంతపు సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనికి తగిన వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉన్నతి సర్వేపై సమీక్షించారు. సమావేశంలో ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ బుజ్జి, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన వారికి ఫైన్..

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జివలస గ్రామం వద్ద ఈనెల 23వ తేదీ రాత్రిపూట గ్రావెల్ తవ్వుతున్న జేసీబీ, ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని బాధ్యులకు 29 వేల రూపాయల అపరాధ రుసుం విధించినట్లు తహసీల్దార్ ఎం.శ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భూగర్భశాఖ విజిలెన్స్ అధికారులు సమాచారం అందించారని పేర్కొన్నారు. మరోసారి వాహనాలు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

● ఆకస్మిక తనిఖీ

బొబ్బిలి మండలంలోని కోమటిపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పి. రవి కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. జియో ట్యాగింగ్ సర్వే ఎలా చేపడుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈయన వెంట ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు ఉన్నారు. - బొబ్బిలి రూరల్



● అప్రమత్తం...



తుఫాన్ ప్రభావంతో ఈనెల 30 వరకు వర్షసూచన ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కె.శిరీష తెలిపారు. ఈ మేరకు మండలంలోని కోడూరు, అచ్చియ్యపేట గ్రామాల్లో బుధవారం పర్యటించి రైతులను చైతన్యపరిచారు. కోసిన వరి పంటను వెంటనే కుప్పలుగా వేసుకోవాలని, కళ్లాల్లో నూర్పులు చేసిన రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించుకోవాలని సూచించారు. - బాడంగి

ప్రమాదకర ప్రయాణం

- శిథిలావస్థలో పలు వంతెనలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు



వాసుదేవపట్నం వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి



మల్లయ్యపేట వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన



రామారాయపురం వద్ద రక్షణగోడ కూలి ప్రమాదకరంగా మారిన వంతెన

సంతకవిటి: మండలంలోని వంతెనలు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇరుకు వంతెలనలతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు వంతెలనలు పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారాయి. ఇరుకుగా ఉండడంతో పాటు ఇరువైపులా రక్షణ గోడలు విరిగిపోయి ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఎంతో కాలంగా వంతెనల దుస్థితి ఇదే విధంగా ఉన్నా.. వాటిని ఎవరూ పట్టించుకోవడంలేదు. సంతకవిటి హొంజరాం ప్రధాన రహదారిలో వాసుదేవపట్నం వద్ద నారాయణపురం కుడికాలువపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో పాటు, పైన ఎటువంటి రక్షణ గోడ లేదు. ఇదే ప్రాంతంలో ప్రమాదకరంగా రోడ్డు మలుపు ఉండడంతో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు బయపడుతున్నారు. అలాగే మల్లయ్యపేట వద్ద నారాయణపురం కుడికాలువపై ఉన్న బ్రిడ్జి కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రామారాయపురం వద్ద సాయన్న ఛానల్‌పై ఉన్న బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో పాటు రక్షణగోడ కొంతమేర శిథిలమైంది. ఈ వంతెనల మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వంతెనను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

తెర్లాం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం బుధవారం సజావుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆ పథకం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్యాణ చక్రవరి హాజరై సామాజిక తనిఖీ బృందం చేసిన ఆడిట్‌కు సంబంధించి గ్రామాల వారీగా సమీక్ష చేశారు. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.21.41 కోట్ల రూపాయలతో చేపట్టిన 1847 పనులకు సంబంధించి సామాజిక తనిఖీ వారం రోజులుగా నిర్వహించారు. అయితే పలు గ్రామాల్లో చనిపోయిన వ్యక్తుల పేరున మస్తర్లు వేసి డబ్బులు చెల్లించారని.. ఉద్యానవన పంటల్లో భాగంగా నాటిన మొక్కలు చనిపోయాయని.. మస్తర్లలో దిద్దుబాట్లు.. వేతనదారుల వేలిముద్రలు.. సంతకాలు సరిగా లేవని.. కొన్ని గ్రామాల్లో వేతనదారుల నుంచి వారానికి రూ.100 వసూలు చేశారనే విషయాలు వెల్లడైనట్లు సిబ్బంది సభ దృష్టికి తీసుకువచ్చారు. పీడీ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ.. మస్తర్లు సరిగ్గా వేయలేని మేట్లను తొలగించాలని ఆదేశించారు. చనిపోయిన వ్యక్తుల పేరున మస్తర్లు వేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కొరటాం క్షేత్ర సహాయకునిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజావేదికలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ రేగి రాంబాబు, ఏపీడీ శ్రీనివాసరావు, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ మన్మధరావు, ఏపీఓ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక రోగాలు నయం



ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద మందులతో దీర్ఘకాలిక రోగాలను నయం చేయవచ్చని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ అన్నారు. దేశ్‌కా ప్రకృతి పరీక్షన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక రోగాలకు అవసరమైన మందులు ఆస్పత్రిలో సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ప్రతి వ్యక్తి శరీర ధార్మిక స్వభావాన్ని అంచనా వేయడంలో ఆయుర్వేదం సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్తలుగా మహిళా సంఘ సభ్యులు



మాట్లాడుతున్న ఏరియా కో ఆర్డినేటర్ ఆదయ్య

బాడంగి: మండలంలోని పొదుపుసంఘాల సభ్యులందరినీ వ్యాపారవేత్తలుగా తయారు చేయాలని ఏరియా కో ఆర్డినేటర్ ఎస్.ఆదయ్య కోరారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘాలన్నింటినీ ఏ గ్రేడ్‌లో ఉండేలా చూడాలన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలు సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. తీసుకున్న రుణాలను శతశాతం రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రత్నకుమార్, స్త్రీనిధి మేనేజర్ రమేష్, ఎల్సీఏపీఎం దేవుడు నాయుడు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: ఈ నెల 29న శ్రీకాకుళంలో జరగనున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభను జయప్రదం చేయాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం రాజాంలో 'జై మాల- చలో శ్రీకాకుళం' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని కోరుతు చేపట్టనున్న ఈ సభకు నియోజకవర్గంలోని మాలలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆగూరులో పంటకోత ప్రయోగాలు

రాజాం: జిల్లాలో అన్ని ప్రాంతాల్లో పంటకోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా గణాంక అధికారి ఎం.వరహాలరావు ఏఎస్ఓలకు సూచించారు. మండలంలో ఆగూరు గ్రామంలో నిర్వహించిన పంటకోత ప్రయోగాలను బుధవారం పరిశీలించారు. పలు చోట్ల వరి ధాన్యం దిగుబడి ఆశా జనకంగా ఉండగా, మరికొన్ని చోట్ల దిగుబడి తగ్గుముఖం ఉందని వెల్లడించారు. ఆగూరు గ్రామంలో ఎకరాకు 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజాం ఏఎస్ఓ బాలమోహన్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా..

- ఎమ్మెల్యే బేబీనాయన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటుదని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బుధవారం స్థానిక పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. అందుకు సంబంధించిన నగదు రైతు బ్యాంక్ ఖాతాలో జమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సులోచన రాణి, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మడక తిరుపతిరావు, వసంతుల తిరుపతిరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ, సీఈఓ చింతల వాసు, తదితరులు పాల్గొన్నారు.

'బుడా'ను అభివృద్ధిపథంలో నడిపిస్తా..

- బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు



బుడా చైర్మన్‌ను అభినందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబీనాయన తదితరులు

బొబ్బిలి: బుడాను అభివృద్ధిపథంలో నడిపిస్తానని చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. బొబ్బిలి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనతో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబినాయనల సమక్షంలో బుడా కార్యదర్శి దేవకుమార్ ఫైళ్లపై సంతకం చేయించారు. దీంతో తెంటును పలువురు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ వాహనాల్లోనే ధాన్యం తరలింపు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎ.డి శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: రైతులు తమ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేటప్పుడు జీపీఎస్ ఉన్న వాహనాలనే వినియోగించాలని వ్యవసాయశాఖ ఎ.డి మజ్జి శ్యామ్‌సుందర్ సూచించారు. మండలంలోని కోమటిపల్లి, రంగరాయపురం, పెంట, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్వింటా ధాన్యానికి 2,300 రూపాయలు అందిస్తున్నట్లు చెప్పారు. తేమ 17 శాతం దాటకుండా చూసుకోవాలని, గోనె, కలాసీ, రవాణా ఖర్చులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఇథనాల్ అక్రమంగా వినియోగిస్తే కఠిన చర్యలు



ఫ్యాక్టరీలో ఇథనాల్ నిల్వలను తనిఖీలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు

రేగిడి: ఫ్యాక్టరీలో తయారుచేస్తున్న ఇథనాల్ వినియోగంలో అక్రమం ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు హెచ్చరించారు. మండలంలో సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ షుగర్ ఫ్యాక్టరీని బుధవారం సందర్శించారు. ఫ్యాక్టరీలో ఇథనాల్ తయారీ, నిల్వలను తనిఖీ చేశారు. భద్రత ప్రమాణాలు పాటించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. రవాణాలో ఎటువంటి అవకతవకలకు అవకాశం ఇవ్వరాదని, అటువంటి కార్యకలాపాలు చేస్తే ఫ్యాక్టరీ నిర్వహణపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట రాజాం సీఐ ఆర్.జైభీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

రుచికరంగా మధ్యాహ్న భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. మండలంలోని మగ్గూరు ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. పాఠశాల రికార్డుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తర్డ్ కో-ఆర్డినేటర్ జి.రామారావు, హెచ్‌ఎం పి.శ్రీకర్, రెడ్డి వాసు, ఆనందరావు ఉన్నారు.

ప్యానల్ బోర్డులను మార్చండి

- పబ్లిక్ హెల్త్ ఈఈ జ్యోతి



నీటి సరఫరా కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఈఈ జ్యోతి

బొబ్బిలి: పట్టణ ప్రధాన నీటి వనరైన భోజరాజపురం ప్రధాన నీటి సరఫరా కేంద్రంలో ప్యానెల్ బోర్డులను మార్చాలని ప్రజారోగ్య శాఖ ఈఈ ఎస్.జ్యోతి సిబ్బందిని ఆదేశించారు. సంబంధిత నీటి సరఫరా కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి పరికరాలను తనిఖీ చేశారు. వైరింగ్‌ను పూర్తిగా మార్చడంతో పాటు పైప్‌లైన్ లీకులను అరికట్టాలని సూచించారు. క్లోరినేషన్ లెవెల్స్‌ను నిర్దేశిత ప్రమాణాల్లో నిర్వహించాలన్నారు. పరిశీలనలో కమిషనర్ ఎల్. రామలక్ష్మి, డీఈఈ పి. కిరణ్, ఈవీవీఎస్ఎన్ ఈశ్వర గుప్త, సిబ్బంది పాల్గొన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి



రాజాం సిటీ: రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ రేణుకాసాయి



సంతకవిటి: మండాకురిటిలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ నవీన్

రాజాం సిటీ: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంట కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి ఎం.రేణుకాసాయి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. ఇప్పటికే వరి నూర్పులు పూర్తిచేసిన వారు కళ్లాల్లో ఉన్న ధాన్యంను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, తమకు నచ్చిన మిల్లులకు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చునని తెలిపారు.

సంతకవిటి: వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఏఓ పైల నవీన్ అన్నారు. మండాకురిటి గ్రామంలో బుధవారం పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు.

వంగర: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు, ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. మద్దువలస, మగ్గూరు, సంగాం, వంగర, శివ్వాం, ఎం.సీతారాంపురం గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు.

రేగిడి: వాతావరణం మారడంతో రైతులు అప్రమత్తమయ్యారు. పంట పొలాల్లో కోసిన వరి పంటను కళ్లాలకు తీసుకువచ్చి కుప్పలు పెట్టుకుంటున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది బుధవారం పలు గ్రామాల్లో పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు.

● బాల్య వివాహాలు అరికట్టాలి..



తెర్లాం: బాల్య వివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ రాంబాబు, తదితరులు


బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను నిర్మూలించాలనే ఉద్దేశంతో వివిధ శాఖల అధికారులు బుధవారం వాడవాడలా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత వయసు రాకుండా వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ముఖ్య కూడళ్లలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేయడం సాంఘిక దురాచారమని అధికారులు వివరించారు. రెవెన్యూ, ఐసీడీఎస్, వెలుగు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. - బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



బాడంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్-2, ఐసీడీఎస్ సిబ్బంది ప్రతిజ్ఞ



రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీటీ కృష్ణసాయితేజ



వంగర: మద్దువలస గురుకులంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది



సంతకవిటి: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



రామభద్రపురం: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ రత్నం,తదితరులు



రేగిడి: దేవుదల కేజీబీవీలో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



బొబ్బిలి రూరల్: పెంటలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



రాజాం: బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, తదితరులు